ప్రశాంతంగా టీసీసీ పరీక్ష

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 25 : జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సినిమావాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య వెల్లడించారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్ లోయర్ పరీక్షలకు ఉదయం 513 మంది విద్యార్థులకు 367 మంది హాజరు కాగా మధ్యాహ్నం 513 మందికి 366 మంది హాజరై పరీక్షలు రాశారన్నారు. పరీక్ష కేంద్రాలను ఏసీజీఈ దామోదర్ రావు పరిశీలించారు.

బహిరంగ వేలం పాట

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 25: చెన్నూర్ మండలంలోని కత్తెరశాల గ్రామంలో శివరాత్రి పండుగను పురస్కరించుకొని మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం పలు సామగ్రి విక్రయించేందుకు బహిరంగవేలం పాట నిర్వహిస్తామని ఆలయ ఈవో రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకు మహాశివరాత్రి పండుగ నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతరలో కొబ్బరికాయలు, పులిహోర, లడ్డూ ప్రసాదం, నూనె, బోనాలు చెల్లించేందుకు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు అందించి, వెయ్యి రూపాయలను ముందుగానే చెల్లించాలని కోరారు.

పలు రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత

తాండూర్, ఫిబ్రవరి 25 : మండలంలోని రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల హాల్టింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు స్పష్టం చేశారు. థర్డ్ లైన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో మార్చి 12వ తేదీ వరకు రేచిని రోడ్ లోని రైల్వేస్టేషన్‌లో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్‌లు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-All

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

FINANCIAL SERVICES

★రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.
NT-311956-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

ఇక ఆన్‌లైన్‌లో 'ఫెస్టిసైడ్స్' లైసెన్స్‌లు

- గతేడాది సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ వివరాలు
- నకిలీ పీసీలకు చెక్
- నెలాఖరులోగా చేయాలి
- డీఏవో కల్పన

ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్న మండల వ్యవసాయాధికారి కృష్ణ

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 25 : రోజు రోజుకూ పెరుగుతున్న నకిలీ కంపెనీల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయ శాఖ మరో అడుగు ముందు కేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విత్తనాలు, ఎరువుల లైసెన్స్‌లు ఆన్‌లైన్ చేయగా ప్రస్తుతం పురుగు మందుల లైసెన్స్‌లు కూడా ఆన్‌లైన్ చేసే పనిలో పడింది. నకిలీ కంపెనీల నుంచి రైతులు బయటపడే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో లేని కంపెనీల పురుగు మందులను విక్రయించకుండా కట్టుదిట్టం చేస్తే నకిలీ పురుగు మందులను రైతులను కాపాడినట్లవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

ఆన్‌లైన్‌లోకి గతేడాదే నుంచే సీడ్ అండ్ ఫర్టిలైజర్‌ల వివరాలు...

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సరఫరా అయ్యే విత్తనాలు, ఎరువులు నాణ్యమైనవే ఉండాలనే ఉద్దేశంతో గతేడాది సీడ్స్, ఫర్టిలైజర్ల లైసెన్స్‌లు ఆన్‌లైన్ చేయించింది. దీనితో నకిలీ సీడ్ కంపెనీలు విత్తనాలకు అడ్డుకట్ట పడినట్లయింది. ఎరువుల దుకాణానికి సదరు ఫర్టిలైజర్ కంపెనీ 'ఓ' ఫాం ఉంటేనే విక్రయించడం ప్రారంభమైంది. ఫెస్టిసైడ్స్ లైసెన్స్‌లను సైతం ఆన్‌లైన్ చేసే క్రమంలోనే ఎన్నికలు రావడంతో వాయిదా పడింది. ప్రస్తుతం ఆ చర్యను సంబంధిత శాఖ అధికారులు చేపట్టారు. గతంలో పీసీ, ఓ ఫారంలు అమాండ్‌మెంట్ చేయాలంటే దుకాణా యజమాని మండల వ్యవసాయాధికారి(ఏవో) దగ్గరకు వచ్చే వారు, ఈ విధానంతో ఏవోనే దుకాణం వద్దకు వెళ్లి అన్ని పరిశీలించాక అమాండ్‌మెంట్ చేసే అవకాశం కల్పించారు.


ఫెస్టిసైడ్స్ నమోదుకు సంబంధించిన వెబ్‌సైట్

నకిలీ పీసీలకు చెక్...

ఆన్‌లైన్ ఫెస్టిసైడ్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టంతో నకిలీ పీసీ(ప్రిన్సిపల్ సర్టిఫికెట్)లకు చెక్ పడనుంది. మ్యానువల్‌గా ఉన్నప్పుడు పురుగు మందులకు సంబంధించిన పీసీలు కేవలం ఏవో పరిశీలించి అమాండ్‌మెంట్ చేసేవారు. అందులో కొన్ని కంపెనీలు అర్హత లేకున్నా ప్రొడక్టులతోపాటు పీసీలు ఫెస్టిసైడ్ దుకాణాలకు అందించే వారు. దాని అనామత్‌తో స్థానికంగా దుకాణా యజమానులు రైతులకు ఆ కంపెనీ పురుగు మందులను విక్రయించేవారు. ఆన్‌లైన్ కావడంతో అర్హత గల కంపెనీల పీసీలు మాత్రమే తీసుకోనుంది. దీంతో నకిలీ కంపెనీల బండారం బయటపడనుంది.

జిల్లాలో 389 దుకాణాలు...

జిల్లాలోని 18 మండలాల్లో 389 పురుగు మందులు విక్రయించే దుకాణాలున్నాయి. బెల్లంపల్లి మండలంలో 17 దుకాణాలు, భీమారంలో 8, భీమినిలో 15, చెన్నూర్‌లో 57, దండేపల్లిలో 42, హాజీపూర్‌లో 17, జైపూర్‌లో 16, జన్నారంలో 26, కన్నెపల్లిలో 24, కాసిపేటలో 11, కోటపల్లిలో 32, లక్షెట్టిపేటలో 35, మంచిర్యాలలో 18, మందమర్రిలో 14, నస్పూర్‌లో 3, నెన్నెలలో 13, తాండూరులో 18, వేమనపల్లి మండలంలో 23 పురుగు మందుల దుకాణాలున్నాయి.

నెలాఖరులోగా పూర్తి చేయాలి

కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెలాఖరులోగా అన్ని పురుగుల మందులు విక్రయించే దుకాణాల లైసెన్స్‌ల వివరాల ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. దుకాణానికి పురుగుల మందులు విక్రయించేందుకు లైసెన్సు ఉందా! లేదా!, దుకాణ యజమాని వివరాలు, దుకాణం ఎక్కడ ఉంది, గోదాం ఉంటే దాని వివరాలు, దుకాణం నడిపే వారి వివరాలు, దుకాణంలో విక్రయిస్తున్న పురుగు మందుల కంపెనీల నుంచి ఇచ్చిన పీసీల వివరాలు, లైసెన్స్ వివరాలను మండల వ్యవసాయాధికారులు ఆన్‌లైన్ చేస్తున్నారు.

- కల్పన, జిల్లా వ్యవసాయాధికారి, మంచిర్యాల

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే వివేక్ పరామర్శ

సాహిబ్ కుటుంబ సభ్యులను చెన్నూర్‌లో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్ టౌన్/చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 25: చెన్నూర్ మండలంలోని కత్తెరశాల గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓత్కులపల్లికి చెందిన కంకణాల దేవేందర్ రెడ్డి, చెన్నూర్ లైన్ గడ్డ కాలనీకి చెందిన సాహిబ్ ఇద్దరు మృతి చెందారు. ఆదివారం వారి ఇండ్లకు వెళ్లి మృతదేహాల వద్ద చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రమాదానికి గల కారణాలకు జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వివేక్ భరోసా కల్పించారు. ఆయన వెంట మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, సుశీల్, చింతల శ్రీనివాస్, శ్రీధర్ తదితరులున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజమల్లాగౌడ్, కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, బాపగౌడ్, మహేశ్ తివారీ, సుశీల్,చెన్నూరి శ్రీధర్, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్

కనుల పండువగా రథోత్సవం

- నరనారాయణస్వామికి ప్రత్యేక పూజలు

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జన్నారం, ఫిబ్రవరి 25 : మండలంలోని కలమడుగు గ్రామంలో నరనారాయణస్వామి ఆలయ 39వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం నరనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి భక్తులు తాళ్లతో లాగుతూ పుర వీధుల గుండా ఊరేగించారు. వాడలన్నీ నరనారాయణస్వామి నామస్మరణతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యాదగిరి స్వదేశరావు, యాదగిరి శేఖర్‌రావు, కైరం కిషన్‌గౌడ్, శ్రీనివాస్, కాకర నర్సయ్య, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నరనారాయణ స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

అవయవ, రక్తదానం పై అవగాహన అవసరం

- డా.యెగ్గెన శ్రీనివాస్
- జిల్లా కేంద్రంలో యెగ్గెన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మారథాన్

మారథాన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 25: అవయవ, రక్తదానాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మంచిర్యాల ఎయిమ్స్ దవాఖాన డాక్టర్ యెగ్గెన శ్రీనివాస్ అన్నారు. ఆదివారం యెగ్గెన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవయవదానం, రక్తదానంపై జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి ఎయిమ్స్ హాస్పిటల్ వరకు అవగాహన కార్యక్రమంలో భాగంగా మారథాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 1500 మంది తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులున్నారని వారందరితో పాటు ప్రమాదాల బారిన పడిన వారికి రక్తం ఎంతో అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దవాఖానలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. భవిష్యత్‌లో పెద్ద ఎత్తున అవయవ, రక్తదానం శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మారథాన్ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ట్రస్ట్ తరపున మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వైద్యులు, లాయర్లు, విద్యావంతులు, ఉద్యోగులు, అధికారులు, నాయకులు, యువత పాల్గొన్నారు.

రక్తదానం చేసిన అనంతరం ప్రశంసాపత్రం అందుకున్న డా.శ్రీనివాస్

ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రీమియర్ లీగ్‌లో పాల్గొన్న క్రికెట్ జట్లు

కాసిపేట, ఫిబ్రవరి 25 : కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో ఆదివారం కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా జాతీయ గీతాలాపన చేసి మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టోర్నీలో 10 క్రికెట్ జట్లు పాల్గొనుండగా 90 మ్యాచ్‌లు, 26 రోజుల పాటు కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గొంది వెంకటరమణ, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, టోర్నీ నిర్వాహకులు కమటం తిరుపతి, దాసరి శంకర్, మెరుగు శ్రీనివాస్, నాంపాని రాజు, నాయకులు నస్పూరి నర్సింగ్, రత్నం ప్రదీప్, మైదం రమేశ్, జాడి శివ, బలరాం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ చేయాలి

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

దండేపల్లి, ఫిబ్రవరి 25 : మున్నూరు కాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులు సమాజ సేవలో భాగస్వాములవ్వాలని సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు పేర్కొన్నారు. దండేపల్లి మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ మున్నూరు కాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగ సంక్షేమ సంఘ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా పోలంపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా కుంచె కిషన్ సలహాదారులుగా గంగన్న, సుగుణాకర్, శేఖర్ సంయుక్త కార్యదర్శిగా నాగన్న, రవి, గణేశ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు కొండు జనార్దన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొలిశెట్టి బుచ్చన్న, తదితరులున్నారు.

చిన్ననాటి స్నేహితుల ఆర్థిక సాయం

వేణు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న స్నేహితులు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 25: అనారోగ్యంతో మృతి చెందిన నాంపల్లి వేణు కుటుంబానికి ఆయన చిన్ననాటి స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు. శ్రీరాంపూర్‌లోని శ్రీశారద శిశు మందిర్ పాఠశాలలో 2000-01 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి నాంపల్లి వేణు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు ఆయన నివాస ముంటున్న సంఘమల్లయ్యపల్లెకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాంపల్లి వేణు చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. స్నేహితులందరూ సేకరించిన రూ.58000 చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు కల్యాణం రవి, తాజుద్దీన్, నైతం విజయ్, ఎండీ రఫీక్ ఖాన్, గోపు సురేందర్, గుండ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

కవితాగానం చేస్తున్న కవయిత్రి పెండ్యాల సుజాత

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 25 : మంచిర్యాల జిల్లా సాహితీ సంరక్షణ సమితి సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సంస్థ అధ్యక్షుడు దండనాయకుల వామన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కవులు తమ కవితాగానంతో అలరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, ముత్యబోయిన మలయశ్రీ, పెంచాల శ్రీనివాస్, బొల్లవరం జగన్మోహన్ రావు, పెండ్యాల సుజాత, అరికిల్ల ప్రమీల, విద్యాసాగర్ హాజరై వారి కవితాగానం చేశారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో బోనాలు, పట్నాలు

ఆలయంలో పట్నాల వద్ద కూర్చున భక్తులు

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 25: శివరాత్రి పండుగను పురస్కరించుకొని చెన్నూర్ మండలం కత్తరశాల గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమర్పించి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. శివరాత్రికి ముందుగా భక్తులు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ అని ఆలయ ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సాదనబోయిన గోపి, కారెంగుల సతీశ్, పరమేశ్వర్, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

సింగరేణి

కార్మికులకు ప్రమాద బీమా రూ.కోటి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25 : గని ప్రమాదంలోగాని, ఇతర ప్రమాదాల్లో మృతి చెందిన సింగరేణి కార్మికుల కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ప్రమాద బీమా(ఎక్స్‌గ్రేషియా) చెల్లించడానికి సింగరేణి యాజమాన్యంతో యూనియన్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల యాజమాన్యాలతో ఒప్పందం కుదిరిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వీ సీతారామయ్య పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ కృషి ఫలితంగా కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యూనియన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఎస్ఆర్పీ-3 గనిలో నలుగురు కార్మికులు మృతి చెందినప్పుడు కూడా కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేయగా రూ.70 లక్షలు చెల్లించేందుకు బ్యాంకుల యాజమాన్యాలు అంగీకరించాయని చెప్పారు. అందులో భాగంగానే ఆసిఫాబాద్ వాగులో రెస్క్యూ సిబ్బంది ఇద్దరు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలకు రూ.70 లక్షలు చెల్లించారని చెప్పారు. అప్పటి నుంచి తమ యూనియన్ బ్యాంకుల యాజమాన్యాలను కోటి ప్రమాద బీమాకు డిమాండ్ చేసినట్లు చెప్పారు. కార్మికులు మరో రూ.274 చెల్లిస్తే 1.30 కోట్ల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఎస్‌బీఐ యాజమాన్యం కూడా ఈ ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కోటి ప్రమాద బీమా చెల్లించే బ్యాంకులకు వారి వేతనాలు మార్చుకుంటారని చెప్పారు.

కార్మికుల హక్కుల కోసం కృషి

- ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25 : సింగరేణిలో కార్మికులు గుర్తింపు కార్మిక సంఘంగా గెలిపించక పోయినా, ప్రాతినిధ్య కార్మిక సంఘంగా తమ యూనియన్ ప్రధాన కార్యదర్శి బీ జనక్‌ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వం, సీఅండ్ఎండీ, మంత్రులకు సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమ వసతులు, సంస్థ అభివృద్ధికి 25 అంశాలపై విజ్ఞప్తి చేశారని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి సీఅండ్ఎండీ బలరాం, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలుపుతూ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ ఎన్నో రోజులుగా ఉద్యోగ నియామకాలివ్వకుండా పెండింగ్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పించినట్లు తెలిపారు. గోదావరిఖనిలో రూ.25 కోట్లతో కార్మిక కుటుంబాలకు శుద్ధ జలాల సరఫరాకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్మికుల చిరకాల కోరిక 250 గజాల ఇంటి స్థలం ఇప్పించేందుకు డిప్యూటీ సీఎం బట్టివిక్రమార్కను జనక్‌ప్రసాద్ కలిసి విజ్ఞప్తి మేరకు వెంటనే రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు, సింగరేణి యాజమాన్యానికి సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు పరిశీలించి ఇవ్వడానికి ప్రక్రియ మొదలు పెట్టాలని ఆదేశించారని చెప్పారు. జైపూర్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశిందన్నారు. కార్మికులకు సంబంధించి 25 అంశాలపై ప్రభుత్వానికి, సింగరేణికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అనంతరం ఉత్తమ కార్మికుడిగా అవార్డు అందుకున్న జంగం మధును నాయకులు శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాంకుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, కేంద్ర నాయకులు తిరుపతిరాజు, వంల కుమారస్వామి, నీలం సదయ్య, జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు పెంట శ్రీనివాస్, మల్లేశ్, ఎంబడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 25 : ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించడం, కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం ద్వారా, ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల విషయంలో సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఏ వెంకట్, వీ శాంతకుమారి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొల్ల రామన్న అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు మంజూరు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, సమగ్ర శిక్ష కేజీబీవీ, యూఆర్ఎస్, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ, మైనార్టీ, బీసీ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గెస్ట్ తదితర సిబ్బందికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తూ రెగ్యులరైజ్ చేయాలని, మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు, ఉపాధ్యక్షులు చక్రపాణి, లావణ్య, కోశాధికారి కిరణ్, కార్యదర్శులు నర్సయ్య, చంద్రమౌళి, సంతోష్ కుమార్, కిరణ్ కుమార్, బబిత, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 25: క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయానికి సమీప రైల్వే గేట్ సమీపంలో రైలు ఢీకొని శేషుపల్లికి చెందిన కుర్మ కుమార్ (38) శనివారం రాత్రి మృతి చెందినట్లు మంచిర్యాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. గద్దెరాగడి తిమ్మాపూర్ నుంచి శనివారం రాత్రి శేషుపల్లికి కాలినడకన రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో రైలు ఢీకొట్టిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుమార్‌కు భార్య, కొడుకు ఉన్నారు.

బైక్, ఆటో ఢీ : ఒకరి మృతి

హాజీపూర్, ఫిబ్రవరి 25 : మండలంలోని రాపల్లి స్టేజీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. లక్షెట్టిపేట మండలం గుల్లకోటకు చెందిన గుర్రాల శ్రీధర్ రెడ్డి(45) తన ద్విచక్ర వాహనంపై మంచిర్యాలలోని హైటెక్ సిటీలో ఉన్న తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాపల్లి స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న లక్షెట్టిపేట వైపు ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీధర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌తో పాటు ఆటోలోని ఇరువురు ప్రయాణీకులు ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మృతుడి పూర్తి వివరా